ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 28
సంచిక : 145
పేజీలు : 3
ఆదివారం, ఫిబ్రవరి 15, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



### శివరాత్రి ఉత్సవాలకు
## ముస్తాబైన ఆలయాలు

**టీ మీడియా, ఫిబ్రవరి 14 ,మధిర / కూసుమంచి :** మధిరలోని మృత్యుంజయస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ ఆలయానికి ఒకవైపు వైరా నది, మరోవైపు స్మశానవాటిక ఉండడంతో కాశీలోని పవిత్ర క్షేత్రంగా భక్తులు భావిస్తారు. ఈ ఉత్సవాలకు ఖమ్మం జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలు నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. శనివారం ఉత్సవాలకు అంకురారోపణ, స్వామివారిని పెళ్లికొడుకుగా తయారు చేయడం, మామిడి తోరణాల అలంకరణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలు చేపట్టనున్నారు.ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, మృత్యుంజయస్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జగన్మోహన్ రావు తెలిపారు.

**కూసుమంచిలో భారీ శివలింగం..**

/: ఖమ్మం పట్టణానికి 20 కిలో మీటర్ల దూరంలోని కూసుమంచిలో ఉన్న శివాలయం ఉంది. క్రీస్తు శకం 1162 ప్రాంతంలో కూసుమంచిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. రామలింగేశ్వరస్వామిగా పూజలందుకుంటున్న శివుడు కాలం గడుస్తున్న కొద్దీ గణేశ్వరస్వామిగా ప్రసిద్ధి చెందాడు. గర్భాలయంలోని శివ లింగం 12 అడుగుల ఎత్తు, 6.3 కైవారంతో ఏకశిలా

మిగతా 3లో

# క్యాంపు రాజకీయాలు

### -ఏపీకి తరలించిన నేతలు
### -కల్లూరులో చైర్మన్ పీఠంపై వ్యూహాలు




**టీ మీడియా ఫిబ్రవరి 14, ఖమ్మం:** జిల్లా మున్సిపాలిటీల్లో ఎన్నికల ఫలితాల వెల్లడి ముగియడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో గెలిచిన అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు ప్రధాన పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. సత్తుపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీని సాధించినప్పటికీ, మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వరకు తమ అభ్యర్థులను కాపాడుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ క్రమంలో గెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరిని ప్రత్యేక వాహనాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ లేదా విశాఖపట్నం వంటి ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం.మరోవైపు, కొత్తగా ఏర్పడిన కల్లూరు మున్సిపాలిటీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడానికి కాంగ్రెస్ శ్రేణులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. గెలిచిన అభ్యర్థులను ఇతర పార్టీలు ప్రలోభపెట్టకుండా ఉండేందుకు వారిని రాత్రికి రాత్రే హైదరాబాద్ కు తరలించినట్లు తెలుస్తోంది. చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నికల సమయానికి వీరిని నేరుగా కల్లూరుకు తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. సత్తుపల్లి , కల్లూరు మున్సిపాలిటీల్లో చైర్మన్ అభ్యర్థులు ఎవరనే దానిపై ఇప్పటికే పార్టీల లోపల తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. సామాజిక సమీకరణాలు , పార్టీ విధేయతను బట్టి అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. అప్పటివరకు కౌన్సిలర్లందరినీ ఐకమత్యంగా ఉంచడం కోసం ఈ క్యాంపు రాజకీయాలు అనివార్యమయ్యాయని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు.




## ఫుట్బాల్ పోటీలను ప్రారంభించిన కలెక్టర్



**టీ మీడియా, ఫిబ్రవరి 14 ,పాల్వంచ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శనివారం జిల్లా స్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్ ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కేటీపీఎస్ ఏడవదశ ఏడవ దశ చీఫ్ ఇంజనీర్ సూర్య నారాయణలు ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లాలోని మణుగూరు, భద్రాచలం, ఇల్లందు కొత్తగూడెం, ఖమ్మం, చర్ల, రుద్రంపూర్, పాల్వంచ జట్లు పాల్గొన్నాయి. నిర్వాహకులు రెండు రోజులు పాటు

మిగతా 2లో









## రాష్ట్రస్థాయి శిక్షణకు సర్పంచ్ ఎంపిక

### -ఉత్తర్వులు జారీ చేసిన డిపిఓ

**టీ మీడియా, ఫిబ్రవరి 14, కొణిజర్ల :**రాష్ట్రస్థాయి మహిళా గ్రామ పంచాయితీ సర్పంచ్ల శిక్షణా తరగతులకు కొణిజర్ల మండలంలోని మేకల కుంట గ్రామ సర్పంచ్ భూక్యా అనితనీ జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు ఎంపిక చేశారు. హైదరాబాద్ లోని రాజేంద్రనగర్ లో ఉన్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీరాజ్ భవన్ లో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న . ప్రతి జిల్లా నుంచి

మిగతా 3లో



## మౌంట్ ఫోర్ట్ పాఠశాల కు పూర్వ విద్యార్థుల వితరణ

### అతిథి గా హాజరై న గుండాల కృష్ణ

**టీ మీడియా, ఫిబ్రవరి 14 , ఖమ్మం :** ఖమ్మం నగరంలోని గుట్టల బజార్ ప్రాంతంలో గల మౌంట్ ఫోర్ట్ పాఠశాల కు ఆపాఠశాల లో విద్యనభ్యసించిన 1982 బ్యాచ్ విద్యార్థులు 50 కుర్చీలను వితరణ గావించారు.దీనితో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరం లో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు, స్కేళ్ళు,పెన్నులు, పెన్సిల్లతో పాటు పరీక్ష సామాగ్రి అందజేశారు.ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు,ఎస్.బి. ఐ.టి., ఆర్జెసి విద్యా సంస్థల ఛైర్మన్ గుండాల కృష్ణ హాజరై పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రదర్ జాన్ పాల్ కు,పరీక్ష సామాగ్రి ని విద్యార్థుల కు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం పాఠశాల అభివృద్ధి కి కట్టుబడి ఉందని తెలిపారు.దీనిలో భాగంగానే ఇప్పటికే సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.భవిష్యత్ లోనూ దీనిని కొనసాగిస్తామని వెల్లడించారు.కుర్చీల వితరణకు,పరీక్ష సామాగ్రి అందజేతకు అన్నివిధాల సహకరించిన వారికి ఆయన ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్ లోనూ ఇదే తరహాలో సహాయ,సహకారాలు అందించాలని కోరారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ పాల్ మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పాటుపడటం,విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేయటం అభినందనీయమన్నారు.పూర్వ విద్యార్థుల సంఘం కు,పూర్వ విద్యార్థులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు థామస్,రవి,పూర్వ విద్యార్థులు బాల శౌరీ,బీవీ.రామారావు,గుడ్ల శ్రీనివాస్, పీవిజి. మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## మావోయిస్టుల డంప్ నిర్వీర్యం

**టీ మీడియా, ఫిబ్రవరి 14 ,బీజాపూర్ :**
**ఛత్తీస్‌గఢ్** రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల డంప్‌ను భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశాయి. ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తడపలగుట్టల్లో 14 ఐఈడీలను గుర్తించిన జవాన్లు బాంబ్ డిస్పోజ్ టీంకు సమాచారం ఇచ్చారు. 13 బీరు సీసాల్లో, ఒక ఐరన్ పైపులో అమర్చిన ఐఈడీని నిర్వీర్యం చేశారు. భూమిలో పాతిపెట్టిన డ్రమ్ముల్లో పేలుడు పదార్థాలతో పాటు 11 కిలోల గన్ పౌడర్, మావోయిస్టుల యూనిఫామ్స్ సైతం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మోదక్‌పాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంగుడు గ్రామంలో, టేకుమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుంజాపారా గ్రామాల్లో మావోయిస్ట్ అమరవీరుల స్మారక స్తూపాలను భద్రతాబలగాలు కూల్చివేశాయి.




## ఎస్ఎస్సీ స్టేట్ టాపర్ కు రూ.5 లక్షల బహుమతి

**టీ మీడియా, ఫిబ్రవరి 14 ,పెనుబల్లి** : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ స్టేట్ టాపర్?గా నిలిచిన విద్యార్థులకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.5 లక్షల బహుమతి అందించనుంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆ కంపెనీ బంపర్ ప్రకటించింది. పెనుబల్లి మండలం వీఎం బంజరు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి ఇమ్మడి రామకృష్ణ, ప్రతినిధులు పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు స్టేట్ టాపర్ గా నిలిచిన వారికి రూ.5 లక్షల బహుమతి, స్టేట్ రెండవ స్థానంలో నిలిచిన వారికి రూ.3 లక్షలు, జిల్లా టాపర్ గా నిలిచిన విద్యార్థులకు రూ.2 లక్షల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గ టాపర్ కు రూ.లక్ష, మండల స్థాయి టాపర్ కు రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. అనంతరం ప్రోత్సహాకాలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు.

# తీర్థాల జాతరకు వచ్చే భక్తులకు పోలీస్ సూచనలు

**టి మీడియా, ఫిబ్రవరి 14 , ఖమ్మం రూరల్:** మహా శివరాత్రి సందర్భంగా తీర్థాల జాతర (శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం) కు విచ్చేసే భక్తులు క్రింది ట్రాఫిక్ / పార్కింగ్ ఏర్పాట్లను తప్పనిసరిగా పాటించగలరని ఖమ్మం పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేయడమైనది. 1.ఖమ్మం పట్టణం వైపు నుండి వచ్చే వాహనాలు దానవాయిగూడెం -- రామన్నపేట -- కామంచికల్ మీదుగా వచ్చి కామంచికల్ మున్నేరు వాగు బ్రిడ్జి సమీపంలో రోడ్డు ఇరువైపుల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలోఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు పార్కింగ్ చేసుకోవాలి. 2.ట్రాక్టర్లు, లారీలు కామంచికల్ -- పాటివారి గూడెం -- జాన్బాద్ తండా మార్గం ద్వారా వెళ్లి కామంచికల్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేయాలి. 3.ఖమ్మం నుండి వచ్చే వాహనాలు కామంచికల్ గ్రామ ప్రవేశం వద్ద స్కూల్ దారి నుండి వెంచర్ ప్రక్క మార్గం ద్వారా తీర్థాలకు వెళ్లాలి. 4.డోర్నకల్, పాపటిపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు కామంచికల్ గ్రామానికి ముందు చెరువు వద్ద కుడి వైపు ఉన్న జామాయిల్ తోట దారి ద్వారా కామంచికల్ వైపు వచ్చి నది ఎడమ వైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు నిలపాలి. 5.మద్ది వారిగూడెం, మంగళగూడెం వైపు నుండి వచ్చే వాహనాలు తీర్థాల గ్రామ ప్రవేశం వద్ద ఇరువైపుల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు నిలపాలి. 6.కురవి, ములకలపల్లి వైపు నుండి వచ్చే ఆటోలు, ట్రాక్టర్లు యం.వి.పాలెం -- గుండాల తండా మార్గం ద్వారా వచ్చి తీర్థాల గ్రామ ప్రవేశం వద్ద కుడి వైపు ఉన్న క్వారీ దారి ద్వారా గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలి. 7.ఖమ్మం రూరల్ వైపు నుండి వచ్చే ద్విచక్ర వాహనాలు మరియు కార్లు పల్లెగూడెం -- గోళ్ళపాడు మార్గం ద్వారా వచ్చి మామిడి తోటకు ముందు ఎడమ వైపు తిరిగి ఆకేరు బ్రిడ్జి దాటి గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు నిలపాలి. 8.ములకలపల్లి క్రాస్ రోడ్ నుండి వచ్చే ట్రాక్టర్లు, ఆటోలు, ట్రాలీలు, లారీలు, డీసీఎంలు పల్లెగూడెం జంక్షన్ నుండి ఎ.వి.పాలెం



జంక్షన్ వరకు గూడూరుపాడు గ్రామం మీదుగా వెళ్లి వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్కింగ్ చేయాలి. 9.ములకలపల్లి జంక్షన్ (మహబూబాబాద్ క్రాస్ రోడ్) నుండి పల్లెగూడెం జంక్షన్ -- పోలపల్లి -- గొల్లపాడు మార్గం ద్వారా కేవలం కార్లు మరియు ద్విచక్ర వాహనాలు మాత్రమే అనుమతించబడతాయి. ఈ వాహనాలు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలోనే పార్కింగ్ చేయాలి. 10.భక్తులు పై సూచనలను పాటించి పోలీస్ శాఖకు సహకరించి జాతరను సజావుగా నిర్వహించేందుకు సహకరించగలరు.



## వన సంరక్షణ వీఎస్ఎస్ బాధ్యత

### పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ

**టీ మీడియా, ఫిబ్రవరి 14 సత్తుపల్లి :** వన సంరక్షణ వీఎస్ఎస్?ల బాధ్యత అని పీసీసీఎఫ్?డాక్టర్?సువర్ణ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి అటవీ రేంజ్ పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. అక్కడి ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. విద్యార్థులకు అటవీ ప్రాముఖ్యత గురించి వివరించారు. స్థానికంగా ఉన్న హెల్త్ సబ్ సెంటర్ ను పరిశీలించారు.ఇస్తరాకుల తయారీ యూనిట్, ఒత్తులు, తేనెటీగల పెంపకం తీరు తెన్నులను గురించి వీఎస్ఎస్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సత్తుపల్లి టెంపర్ డిపోలో నూతనంగా నిర్మించిన వీఐపీ గదిని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎఫ్ వో సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఎఫ్ డీవో మంజుల, రేంజర్ స్నేహలత, సిబ్బంది పాల్గొన్నారు.



## యూరియా కోసంఆందోళన చెందొద్దు

### -ఏడీఏ సతీశ్, ఏవో వాణి

**టీ మీడియా, ఫిబ్రవరి 14 కూసుమంచి:** పీఏసీఎస్, ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా రైతులకు సరిపడా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనిఏడీఏ సతీశ్, ఏవో వాణి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలో జీళ్లచెరువు, చేగోమ్మ సొసైటీలు, ప్రైవేట్?ఎరువుల దుకాణాలను అధికారులు సందర్శించి యూరియా స్టాక్?ను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాప్ ద్వారా రైతులు బుక్ చేసుకున్న యూరియాను ఒక్క రోజే 4,813 బస్తాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. చదువురాని రైతులకు ఏఈవోలు, వలంటీర్లు యాప్?లో బుక్?చేసేందుకు అందుబాటులో ఉంటారని చెప్పారు. వారి వెంట ఏఈవో రవీందర్, సొసైటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఫుట్బాల్ పోటీలను ప్రారంభించిన కలెక్టర్

ఈ పోటీలు నిర్వహిస్తున్నామనీ కళాభారతి ఫుట్బాల్ క్లబ్ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైస్ ఓ పరంధామ రెడ్డి, ఫుట్బాల్ కప్ వ్యవస్థాపకులు సుధాకర్ రాజు, ఎస్సీ సివిల్ యుగపతి, ఆరిఫ్ పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగే పోటీలలో గెలిచిన జట్టుకి ట్రాఫిక్ మరియు నగదు బహుమతి ఇవ్వనున్నారు. క్రీడాకారులకు భోజన వసతి సదుపాయాలు భోజనం వసతి సదుపాయాలు నిర్వాహకులు కల్పించారు.

## గురువులకు ఘన సన్మానం

**టీ మీడియా ,ఫిబ్రవరి 14, తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తిరుమలాయపాలెం వివిధ గ్రామాలకు చెందిన ఎస్ ఎస్ సి 1984.. 95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 34 వసంతాల సమ్మేళనం సందర్భంగా



గురువులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దటంలో గురువుల పాత్ర అనిర్వేచనీయమని ఈ ఆత్మీయ సమ్మేళనం పెట్టుకోవడానికి చిన్ననాటి విద్యాభ్యాసంలో జరిగిన కష్ట సుఖాలను నెమర వేసుకొని భవిష్యత్తు తరాలకి ఈ జీవితంలో ఎలా ఎదిగారో చెప్పి భవిష్యత్తు తరాలు కూడా విద్య పట్ల చక్కటి శ్రద్ధతో చదివి ముందుకెళ్లే విధంగా ఆత్మీయ సమ్మేళనం ఉపయోగపడాలని పాఠశాల దశలో నేర్చుకున్న అనుభవాలు సుఖాలు అన్నిటిని పేరుపేరునా పంచుకోని ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. సందర్భంగా పలువురు వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఆళ్ల రామారావు సత్యనారాయణ ఆళ్ల నాగేశ్వరరావు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పదముత్తు అజరయ్య, నూక తొట్టి సల్మాన్ రాజు, వీరన్న, సైదమ్మ, కొమ్ము నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశవాణిలో రేడియో కిసాన్ దివస్

### -- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

**టీ మీడియా, ఫిబ్రవరి 14 , కొత్తగూడెం** :రేడియో స్టేషన్‌లో శనివారం 'రేడియో కిసాన్ దివస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రేడియో కేంద్రం ప్రాంగణంలో పలు ఔషధ, పూల మొక్కలతో ఏర్పాటు చేసిన "ప్రకృతి మాత గ్రీన్ గార్డెన్" ను స్టేషన్ ప్రోగ్రామ్ హెడ్ కొలిపాక



శంకరరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబురావు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్, రామవరం పశు వైద్యులు డాక్టర్ జి.ఆనందరావు, పలువురు ఆదర్శ, అభ్యుదయ రైతులు పాల్గొని మాట్లాడారు.రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే సమీకృత వ్యవసాయం ద్వారా సాధ్యమవుతుందన్నారు. పంటలతో పాటుగా చేపలు, కోళ్లు, మేకలు, ఇతర పంటలతో వ్యవసాయం చేస్తే రైతుకు ఎంతో లాభామన్నారు. రైతులను చైతన్యవంతులు చేసేందుకు రేడియో ద్వారా ప్రసారం చేస్తున్న వ్యవసాయ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్నారు. అనేక సంవత్సరాలుగా రేడియో ద్వారా రైతులకు అందిస్తున్న వ్యవసాయ కార్యక్రమాల ద్వారా రైతుల్లో ఆసక్తిని, చైతన్యాన్ని కలిగిస్తున్న ఆకాశవాణికి అభినందనలు తెలిపారు. కిసాన్ దివస్ ను పురస్కరించుకుని పలువురు అభ్యుదయ రైతులను, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, క్రీస్తు రాజు, సందీప్, హనుమా, మొక్కల పెంపకందారులు నూర్వి రాజశేఖర్, రామంచి శ్రీనివాస్, రేడియో స్టేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది బాబు సింగ్, సుమన్, ఆనంద్, కోటేశ్వరరావు, రేడియో జాకీలు పాల్గొన్నారు.




## మరియమ్మ చిత్రపటానికి నివాళులు

**టీ మీడియా, ఫిబ్రవరి 14 ,తిరుమలాయపాలెం:** కొప్పుల మరియమ్మ పెద్ద కర్మ జరుగుతున్న సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని ఖమ్మం జిల్లా మాల మహానాడు సంఘం నాయకులుపూలతో ఘనంగా శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది ఈ కార్యక్రమంలో గుంతెటి వీరభద్రయ్య జిల్లా అధ్యక్షులు మెట్టువెంకటేశ్వర్లు చిలక బత్తిని కనకయ్య, లింగాల రవికుమార్ , ఎర్ర గంగాధర్, చింతపల్లి వెంకన్న, బిందె రమేష్ , జమ్మి వీరబాబు ,జనక సురేష్ , కామల్ల నరేష్ తదితరలు పాల్గొన్నారు.




## కోటిలింగాల జాతరకు ఏర్పాట్లు పూర్తి

### ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్

**టీ మీడియా,ఫిబ్రవరి14,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ కోటిలింగాల దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ జిల్లా సహా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే ఈ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్య పనుల కోసం ఆరు బృందాలను నియమించినట్లు వెల్లడించారు.అలాగే వివిధ శాఖల సమన్వయంతో స్వామివారి దర్శనం సాఫీగా జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, రవాణా తదితర సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆలెం వెంకటేశ్వర్లు భాగ్యనగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ హిరాలాల్, గ్రామపంచాయతీ కార్యదర్శులు అనిల్, నెహ్రూ, నిరంజన్ కుమార్, సంతోష్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ కెనాల్ దగ్గర దొంగల కలకలం



**టీ మీడియా, ఫిబ్రవరి 14, భూర్గంపాడు :** భూర్గంపాడు మండలం జింకలగూడెం లో వృద్ధి రాలి పైన దాడిచేసి బంగారం, నగదు అపహరించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది, కుక్కునూరు మండలం వేలేరుకు చెందిన సుమారు 70 సంవత్సరాలు పైబడిన వృద్ధురాలిని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బియ్యం, గోధుమపిండి ఇప్పిస్తామని నమ్మబలికి బూర్గంపాడు సెంటర్ నుండి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని జింకల గూడెం గ్రామంలోని సీతారామ కెనాల్ పక్కకు జనసంచారం లేని ప్రాంతానికి తీసుకువెళ్లి తనను కొట్టి నోరు నొక్కేసి తన దగ్గర ఉన్న బంగారపు గొలుసు, చెవి దుద్దులు, పట్టీలు సుమారు 4000 రూపాయల నగదు, ఒక సెల్ ఫోను లాక్కొని ఎవరికైనా చెపితే చంపేస్తామని బెదిరించి అక్కడి నుండి పరారయ్యారు. ఆ భయం తోనే అక్కడి నుండి నడుచుకుంటూ బయటకు వచ్చిన మహిళా జరిగిన సంఘటన వివరాలు తెలియజేశారు. భయంతో ప్రధాన రహదారిపై నిల్చున్న వృద్ధురాలిని మొరంపల్లి బంజరు గ్రామానికి చెందిన తాటికొండ ఐలయ్య చూసి వివరాలను తెలుసుకొని, ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని మొరంపల్లి బంజర్ సెంటర్లో ఆటో ఎక్కించి తన ఊరికి పంపించారని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### రాష్ట్రస్థాయి శిక్షణకు

నలుగురు మహిళా సర్పంచులను ఈ శిక్షణా తరగతులకు ఆహ్వానం అందిస్తున్నారు. అందులో భాగంగా గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మేకల కుంట సర్పంచిని ఈ శిక్షణ తరగతులు కు ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి టి.రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పాలనలో మహిళా సాధికారత అనే అంశంపై ఐదు రోజులపాటు శిక్షణను ఇవ్వనున్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో వైరా మండలం లోని విప్పలమడక సర్పంచ్ మేడా హేమిమ చక్రపాణి,రఘునాథపాలెం మండలంలోని జీకే బంజర సర్పంచ్ ఎం.జ్యోతి, చింతగుర్తి టీ.ప్రియాంక,ఈ తరగతులకు ఎంపిక చేశారు.

# సంగమేశ్వరుడికి అభిషేకం

### -మహా శివరాత్రిన కళ్యాణ మహోచవం

### -తీర్థాల లో ప్రత్యేకం

**టి మీడియా, ఫిబ్రవరి 14 ఖమ్మం రూరల్:** ఫిబ్రవరి 15 న జరిగే మహా శివరాత్రి కి ఒక ప్రత్యేకమైన కథ ఉంది.మహా శివరాత్రి అంటే హిందువులకు ఒక పవిత్రమైన పండుగగా భావిస్తారు , ఈ రోజు ను శివ పార్వతి కళ్యాణ దినంగా శివుడు తన దివ్య నాట్యం తాండవం చేసిన రోజు గా జారుకుంటారు , ఈ మహా శివరాత్రి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి లేదా మార్చి నెలలో వస్తుంది ఈ మహాశివరాత్రి రోజున ఎక్కువ మంది భక్తులు ఉపాస జాగారం చేసి దేవుని శివలింగాన్ని అభిషేకం చేసి మారేడు దళాలతో పూజలు చేస్తారు .

**తీర్థాల లో ప్రత్యేక మహా శివరాత్రి**

ఈ మహా శివరాత్రి నీ ఖమ్మం జిల్లా లోని ఖమ్మం రూరల్ మండలం లోనీ తీర్థాల అను గ్రామంలో మహా శివరాత్రి నీ ప్రత్యేకం జరుపుకుంటారు , ఈ ప్రాంతంలో మూడు కాలువ ప్రవాహాలు ఒకే దగ్గర కలిసి మున్నీరుగా పిలువబడి సంగమేశ్వరడు కొలువైన ప్రాంతం గా ఏర్పడింది.ఆదివారం జరిగే మహా శివరాత్రి నీ ఉద్దేశించి దేవాదాయ శాఖ ఇఓ వేణుగోపాల్ చారి మాట్లాడుతూ ఈ తీర్థాల ప్రాంతానికి ముగ్గురు మహర్షులు తపస్సు చేసి మూడు నదులు గా ఏర్పడటం వల్ల తీర్థాలుగా ఏర్పడిందని ఇట్టి సంగమం లో స్వామి వారు ఏర్పడటం వలన ఈ గుడిని సంగమేశ్వరుడి గుడి గా పేరుగాంచింది అని ఆదివారం జరిగే మహా శివరాత్రి కి సుమారుగా రెండు నుండి మూడు లక్షల మంది వచ్చే అవకాశం ఉందని వారందరి కోసం వైద్య రవాణా పారిశుద్ధ్యం నీటి వసతి ఏర్పాటు చేశామని ఏర్పాటు చేశామని ఈ ఆలయంలో అన్ని డిపార్ట్మెంట్ల కలుపుకొని 400 మంది సిబ్బంది ఈ ప్రాంతంలో పనిచేస్తున్నారని వారి మాటల్లో చెప్పడం జరిగింది స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఉచిత దర్శనం ఏర్పాటు చేశామని ,వంద రూపాయలు అభిషేకం కోసం రెండు వందల రూపాయలు టికెట్, విఐపి దర్శనం 500 రూపాయలుగా దేవాదాయ శాఖ ఆదర్శాల మేరకు ఏర్పాటు చేయడం జరిగిందని భక్తులకు ఎటువంటి అసౌకర్య కార్యకలాపాలు



ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశామని భక్తుల యొక్క స్థానాల కోసం ప్రత్యేకమైన జల్లు నీటి పరికరాలను అమర్చామని అదేవిధంగా ఈ ప్రాంతంలో భక్తులకి వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ఫైర్ సిబ్బంది , పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని గతంతో పోలిస్తే ఈ సంవత్సరం ఈ మహోత్సవ ఏర్పాట్లను అభివృద్ధి పరచుటకు గౌరవ జిల్లా కలెక్టర్ గారు అనుదీప్ దురిశెట్టి గారు ప్రభుత్వం తరుపున ఆలయ అభివృద్ధి పనులకు 10 లక్షల రూపాయల చెక్ ఇచ్చారని చెప్పడం జరిగింది ఆదివారం జరిగే మహాశివరాత్రి కి ఎక్కువ మంది భక్తులు వచ్చి సంగమేశ్వరుని ఆశీస్సులు తీసుకుంటారని ఆశిస్తున్నట్టు చెప్పడం జరిగింది.



## సఫాయి కార్మికురాలుగా చోటే.

### నేడు కౌన్సిలర్‌గా ప్రజా సేవ..!



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,సూర్యాపేట :**ఆమె ప్రజారోగ్యాన్ని కాపాడడంలో కీలకంగా పని చేశారు. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదేశాల మేరకు పనిచేసింది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 30ఏళ్ల తన సేవలు అందించింది. ఆమె ఇపుడు మరో రూపంలో తన సేవలు అందించేందుకు ముందుకు వచ్చింది.సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన వెంకటమ్మ నేరేడుచర్ల గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలో సఫాయి కార్మికురాలిగా పని చేశారు. పట్టణ ప్రజారోగ్యం కాపాడేందుకు తన సేవలు అందించింది. వెంకటమ్మ తొలుత నేరేడుచర్ల గ్రామ పంచాయతీ, ఆ తర్వాత ఏర్పడిన మున్సిపాలిటీలో సఫాయి కార్మికురాలుగా 30 ఏళ్లుగా చేసింది. చివరికి వెంకటమ్మ సఫాయి కార్మికురాలిగా 2019 డిసెంబర్ రిటైర్మెంట్ అయింది. ఆ తర్వాత కూడా మునిసిపాలిటీలో పనిచేసిన అనుభవంతో చుట్టుపక్కల వారి అవసరాల్లో సహాయం చేస్తూ ఉండేది.ఇలా వెంకటమ్మ నిత్యం జనంతో కలిసి మెలిసి ఉండేది. ఫిబ్రవరి 13న వెలువడిన నేరేడుచర్ల మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో 10వ వార్డు నుండి బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసిన ఆమె గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి రాణిపై 10 ఓట్ల మెజారిటీతో వెంకటమ్మ విజయం సాధించారు. దీంతో ఆమె నేరేడుచర్ల మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. గతంలో ఇదే మున్సిపాలిటీలో సఫాయి కార్మికురాలుగా పనిచేసిన ఆమె ప్రస్తుతం ఇదే మున్సిపాలిటీలో కౌన్సిలర్ గా ఎన్నిక కావడం విశేషం. సామాన్య కార్మికురాలి స్థాయి నుండి ప్రజలకు సేవ చేసే ప్రజాప్రతినిధిగా ఎదిగిన వెంకటమ్మ ప్రయాణం ఇప్పుడు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

### శివరాత్రి ఉత్సవాలకు

రూపంగా నిర్మించారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద శివలింగాల్లో ఇది రెండోది. ఈనెల 14,15,16 వరకు ఈ ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.



## ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం

**టీ మీడియా ,ఫిబ్రవరి 14, భూర్గంపాడు :** భూర్గంపాడు మండలం సారపాక లో శనివారం రోజున ఎడారి రమేష్ అధ్యక్షతన మన భద్రాద్రి ప్రింట్ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ సొసైటీ ప్రెస్ క్లబ్ (రిజిస్ట్రేషన్ నెంబర్ :34/2026 ) ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బూర్గంపాడు ఎస్సై మేడా ప్రసాద్, ఐటిసి కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, టియన్ టియుసి అధ్యక్షులు హరి ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇంగువ రమేష్, భజన ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు ప్రసాద్, ప్రవీణ్, మల్లారెడ్డి, రాంబాబు విచ్చేయడం జరిగింది. అనంతరం బూర్గంపాడు ఎస్సై మేడ ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి నూతన ప్రెస్ క్లబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మేడ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి అన్యాయాన్ని, సమస్యలను వార్తల ద్వారా తెలియజేయాలని విలువలతో కూడిన జర్నలిజాన్ని చూపించాలని తెలియజేశారు. అనంతరం అధ్యక్షుడు ఎడారి రమేష్ మాట్లాడుతూ, “న్యాయం పక్షాన మేము కట్టుబడి ఉంటాం. స్థానిక సమస్యలపై నిజాయితీగా వార్తలను రాయడం జరుగుతుందని, జర్నలిస్టుల సంక్షేమం, విలువలను కాపాడుకుంటాం అని, ఏదైనా అధికారిక ప్రకటన కానీ, ప్రెస్ మీట్ కానీ, ప్రజా సమస్యలను మా దృష్టి కి తీసుకురావడానికి మా నెంబరు 9618194277 ను సంప్రదించగలరని ఆయన కోరారు.



## అధికార పార్టీ నాయకుడి పై దాడి




**టీ మీడియా ,ఫిబ్రవరి 14, బూర్గంపాడు :** మండలంలో రోజుకు వందల లారీలతో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతున్న నేపథ్యంలో రెడ్డిపాలెం కు చెందిన అధికార పార్టీ నాయకుడు బిజ్జం వెంకటేశ్వర రెడ్డి, సారపాక కు చెందిన ఇసుక మాఫియా విరుచుకుపడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. తీవ్ర గాయాలతో ఆ నాయకుడు ప్రస్తుతం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అక్రమ ఇసుక రవాణాపై పలుమార్లు బహిరంగంగా మాట్లాడినందుకా. ఈ దాడి జరిగింది లేక వాటాల వ్యవహారంలో విభేదాలా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలో గోదావరి, కిన్నెరసాని వాగుల నుంచి భారీగా ఇసుక తరలింపులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతానికి బాధ్యత వహిస్తున్న సంబంధిత అధికారి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులకు ముందస్తు సమాచారం అందుతుందా. దాడులు చేయాల్సిన సమయంలో యంత్రాంగం ఎందుకు గైర్హాజరు అవుతోంది, అనే ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. దాడి ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేస్తారా, లేక ఇది కూడా మరికొన్ని ఘటనల్లాగే ఫైళ్లలోనే పరిమితం అవుతుందా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇసుక మాఫియాను అణచివేయాలంటే రాజకీయ, అధికార యంత్రాంగం కలిసికట్టుగా కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయకపోతే మరిన్ని ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.